## విద్య, వైద్య రంగాలలో ఎస్‌ఎంఆర్‌ఏటీ ట్రస్ట్ కృషి అభినందనీయం



విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

**హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ**

రాయదుర్గం: విద్య, వైద్య రంగాలలో శ్రీనివాసన్ మునుస్వామి అండ్ రాధా అద్దంకి ట్రస్ట్ (ఎస్ఎంఆర్ఏటీ ) కృషి అభినందనీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూత అందించడం, వైద్యరంగంలో పరిశోధనల ద్వారా మందులు, వసతులు కల్పించేలా చేయడం వంటి వాటికి ట్రస్ట్ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆయుర్వేద రంగంలో క్యాన్సర్ వంటి రోగాల కోసం పరిశోధనలు చేసి మందులు తయారు చేయించి పేదవారికి అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ఏటీఏ ట్రస్ట్ చైర్మన్, ఎన్ఆర్ఐ డాక్టర్ శరత్ అద్దంకి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఎన్ఆర్ఐ చక్రవర్తి ,ఐటీ చిమెన్ అధ్యక్షుడు శ్రీరాములు, పలువురు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ కిట్స్ అందజేత

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసేందుకే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఫిన్ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ సంస్థ విద్యార్థులకు ఆట వస్తువులు, ఎడ్యుకేషన్ కిట్స్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకోవాలనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం, పార్కర్ హనీఫిన్ సిబ్బంది, ఇంద్రేశం ఎంపీయూపీఎస్ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్ నర్సింలు ,బండి పురుషోత్తం, మెడ్వాన్ కోఆర్డినేటర్ హఫీజ్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దీన్‌దయాళ్‌నగర్ ఏబీఎస్ చౌరస్తా నుంచి గౌతంనగర్ చౌరస్తా వరకు నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఇటీవల తాను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతిపత్రం సమర్పించడమే కాకుండా ఇక్కడ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తేవడం జరిగిందన్నారు. స్పందించిన జోనల్ కమిషనర్ పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక ఇంజనీర్లను ఆదేశించడంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్య పరిష్కారమైందన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## లక్షలు వెచ్చించారు..

# వదిలేశారు

**శిథిలావస్థకు చేరిన మోడ్రన్ మూత్రశాలలు**



- నీటి సౌకర్యం లేక దుర్వాసన
- పట్టించుకోని అధికారులు

మియాపూర్: ప్రధాన రహదారులలో జీహెచ్ఎంసీ మోడ్రన్ మూత్రశాలలను ఏర్పాటు చేసింది. పనుల నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులుపడకుండా ఉండేలా ఏర్పాటు చేశారు. కానీ మూత్రశాలల నిర్వహణపై అధికారుల పట్టింపులేమితో నిరుపయోగంగా మారాయి. వాటి నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం లక్షల రూపాయల నిధులు కేటాయిస్తున్నా ఉపయోగం లేకుండా పోయింది.

- మియాపూర్‌లోని ప్రధాన రహదారులు, బస్టాప్ దగ్గర, ప్రధాన సర్కిళ్లలో గతంలో మోడ్రన్ మూత్రశాలలు ఏర్పాటు చేశారు. నిర్వహణ లేమితో పలు ప్రాంతాల్లోని మరుగుదొడ్లు, శిథిలావస్థకు చేరుకున్నాయి.
- మియాపూర్‌లో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మూత్రశాలలకు నీటి సౌకర్యం లేకపోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని చోట్ల మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి.
- దీంతో పలువురు బహిరంగ మూత్ర విసర్జన చేస్తుండడంతో ప్రధాన రహదారుల వెంబడి దుర్వాసనతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- ఏటా మూత్రశాలల నిర్వహణకు లక్షలాది రూపాయలు కేటాయిస్తున్నా ఆ నిధులు పక్కదారి పడుతున్నాయని, తద్వారా మూత్రశాలలు శుభ్రంగా ఉండడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.
- మూత్రశాలల శుభ్రత, సబ్బులు, శానిటైజర్ తదితర సదుపాయాలు కల్పిస్తామని చెప్పి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆ దిశగా చేయలేదు. వస్తువులు తుప్పుబట్టి పోయి పాడవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.






మియాపూర్‌లో తలుపులు విరిగిపోయి అపరిశుభ్రంగా ఉన్న మూత్రశాలలు

## అరుణాచల క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు

పటాన్‌చెరు టౌన్: భెల్ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు వేశామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అరుణాచల, గిరి ప్రదక్షిణకు భక్తులు అధిక సంఖ్యలో వెళ్తుండడంతో జులై 21 న అరుణాచలంలో జరిగే పౌర్ణమి గిరి ప్రదక్షణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఈ నెల 19వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి శనివారం ఉదయం 8 గంటలకు కాణిపాకం, మధ్యాహ్నం భోజనం, 2 గంటలకు కాణిపాకం నుండి జయలుదేరి సాయంత్రం 5 గంటలకు గోల్డెన్ టెంపుల్' దర్శనం అనంతరం అదే రోజు రాత్రి గోల్డెన్ టెంపుల్ నుండి బయలుదేరి అర్ధరాత్రి అరుణాచలం చేరుకొని,ఆదివారం 21 న 'పౌర్ణమి' రోజు అరుణాచల 'గిరి ప్రదక్షిణ' చేసుకొని, సాయంత్రం 5 గంటలకు తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు.హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ దగ్గరలోని బస్టాండ్‌తో పాటు సమీప టిఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లు బుక్ చేసుకోవచ్చన్నారు.టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్ 9959226149, 7659029882ను సంప్రదించాలన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

హఫీజ్‌పేట్: ఇటీవల చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని వార్డు కార్యాలయంలో ప్రారంభించిన ప్రజాపాలన దరఖాస్తుల సేవా కేంద్రాలలో ప్రజలు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. చందానగర్, హఫీజ్‌పేట్, మియాపూర్, మాదాపూర్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని డీసీ తెలిపారు.

## శ్రీనివాస్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలోని 12వ బ్లాక్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం కారణంగా ఇళ్లల్లోకి మురుగునీరు చేరుతున్నాయని వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. బోనాల పండగ నాటికి సీసీ రోడ్డు అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వాచ్‌మెన్ మృతి

గచ్చిబౌలి: నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో వాచ్‌మెన్ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జోగులాంబ గద్వాల్ జిల్లా, వీరపురం గ్రామానికి చెందిన కొంతింటి వీరస్వామి(40) ఖాజాగూడలోని మాధవరెడ్డి అనే వ్యక్తి నిర్మిస్తున్న భవనంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. కాగా సెల్లార్‌లోని గదిలో మృతి చెంది ఉన్నాడని, తలకు గాయమైందని పోలీసులు తెలిపారు. శనివారం రోజు భవనం ముందు తిరుగుతున్నట్లు సీసీ కెమెరాల్లో కనిపించాడు. సోమవారం మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా భార్య విడాకులు ఇవ్వడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్**

పటాన్‌చెరు టౌన్: సంక్షేమంలో తనకు తానే సాటి అంటూ ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించిన, మరిచిపోలేని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని చిట్కుల్ గ్రామంలో ఎన్ఎంఆర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

**ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ**

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ,కాంగ్రెస్ శ్రేణులతో కలిసి వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజశేఖర్‌రెడ్డి హయాంలో కందిలో ఐఐటి, పటాన్‌చెరులో బస్ టెర్మినల్, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మైనార్టీలకు 4 శాతం రిజ్వేషన్లు ,ఆరోగ్య శ్రీతో పాటు మరెన్నో పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆతీక్ ,పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

గచ్చిబౌలి: గుల్షన్‌నగర్, వడ్డెర బస్తీలలో కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పలుచోట్ల స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని, విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయని, రోడ్డు వేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అబ్దుల్ కరీం, రాములు, వాలియుద్దీన్, కమరుద్దీన్, రహమతుల్లా, భద్రా, రియాజ్, సయ్యద్ ఆయాజ్, ఇమ్రోజ్ పాల్గొన్నారు.



గుల్షన్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హమీద్‌పటేల్

## గవర్నర్‌కు స్వాగతం పలికిన నాయకులు



రాయదుర్గం: హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు సోమవారం స్వాగతం పలికారు. సోమవారం ఆయన నానక్‌రాంగూడకు వచ్చిన సందర్భంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ అందరినీ పేరుపేరునా పలకరించారు. ఆయన్ని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వసంతకుమార్‌యాదవ్, అశోక్, మీన్ లాల్‌సింగ్, నాగులుగౌడ్, మనోహర్, ఆకుల లక్ష్మణ్, శ్రీధర్, జితేందర్, శివసింగ్, సంతోష్‌సింగ్, రంగస్వామి, చిన్నా ఉన్నారు.

# పార్ట్‌నర్‌షిప్ పేరుతో మోసం చేశారు

**హోలిక్ బార్బిక్యూ ఎదుట బాధితుల నిరసన**



కొండాపూర్‌లోని హోలిక్ బార్బిక్యూ వద్ద నిరసన తెలుపుతున్న దంపతులు మౌనిక, ధరణి

గచ్చిబౌలి: పార్ట్‌నర్ షిప్ పేరుతో మోసం చేసి బయటకు గెంటి వేశారంటూ సోమవారం హోలిక్ బార్బిక్యూ ఎదుట బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్.మౌనిక మాట్లాడుతూ నా భర్త ధరణికి సోదరి అయిన సూర్యదేవర శ్రీలక్ష్మి (కజిన్)తో కలిసి కొండాపూర్‌లో హోలిక్ బార్బిక్యూను 2022లో ప్రారంభించామని తెలిపారు. కొద్ది నెలల్లోనే శ్రీలక్ష్మి తన భర్త అయిన సూర్యదేవర అజయ్ పేరిట హోటల్ రిజిస్ట్రేషన్ చేసిందని, జాయింట్ అకౌంట్‌లోని డబ్బు కూడా తన భర్త అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసిందన్నారు. జరిగిన మోసాన్ని నిలదీస్తే కంపెనీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శ్రీలక్ష్మి సంతకం చేసిన పేపర్ చేతిలో పెట్టిందన్నారు. రూ.68 లక్షల పెట్టుబడి పెడితే ఒక్క రూపాయి కూడా తిరిగి ఇవ్వకుండా బౌన్సర్‌లను పెట్టి హోటల్‌లోకి రాకుండా భయపెడుతున్నారని మౌనిక ఆరోపించారు. పైగా మంత్రి పేరు చెప్పి చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయింది. న్యాయం జరిగే వరకు ఇక్కడే దీక్ష చేస్తామన్నారు.

## మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

శేరిలింగంపల్లి: ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్‌గృహకల్ప బ్లాక్‌-6లో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు వీరేశంగౌడ్, స్థానిక నాయకులు శ్రీకళ, కృష్ణారెడ్డి, గోపాల్‌యాదవ్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారులను శుభ్రంగా ఉంచాలి

**జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి**



రాయదుర్గంలో పర్యటిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: రహదారులు శుభ్రంగా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయదుర్గంలోని జీఆర్సీ సెంటర్, మల్కం చెరువు రోడ్డు, కేశవ్‌నగర్, ఆదర్శనగర్, ఫుట్‌పాత్‌లు, రహదారులను పరిశీలించారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పాదచారులు రోడ్డు దాటేందుకు జీబ్రా క్రాసింగ్ లేన్‌లను వేయాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ నగేష్, ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

## రాజపుష్ప నిర్మాణ సంస్థ చేయూత



రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థుల కోసం రాజపుష్ప నిర్మాణ సంస్థ ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలిని నియమించింది.సోమవారం టీచర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట భాస్కర్ చేతుల మీదుగా వేతనం అందించారు. కార్యక్రమంలో స్థానికులు శివశంకర్, కృష్ణ పాల్గొన్నారు.

## వనమహోత్సవం.. స్థల పరిశీలన

మణికొండ: వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. సోమవారం వారు మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి, కోకాపేట, మంచిరేవుల వార్డులలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజావాణి.. 49 వినతులు



ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో 49 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ముఖ్యంగా విద్యుత్ జీరో బిల్లుల కోసం 47 రాగా, పింఛన్లకు ఒకటి, శానిటేషన్‌కు ఒకటి అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ మెహ్రా, ఏఎంసీ శ్రవణ్‌రెడ్డి, సర్కిల్ ఉప వైద్యాధికారి నగేష్, డీఈ రమేష్, ఎలక్ట్రిసిటీ ఏఈ లిఖిత, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

**చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో.. 2**

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపకమిషనర్ వంశీకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 02 వినతి పత్రాలు అందాయని డీసీ వంశీకృష్ణ తెలిపారు.

## కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

శేరిలింగంపల్లి: కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ డివిజన్‌లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ సునీల్, డివిజన్ గౌరవాధ్యక్షులు వీరేశం గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, పవన్, కాలనీవాసులు రవియాదవ్, గోపాల్‌యాదవ్, నారాయణ, లక్ష్మణ్, సీతారామయ్య, బాలాద్రి, శర్మ, మల్లేష్, నిశాంత్, శ్రీలక్ష్మీ, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

## 14 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు శిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 14 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా, మరో వ్యక్తి కి రెండు రోజుల జైలు శిక్షతో పాటు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

## ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, నాబార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 60 రోజుల శిక్షణ కాలం ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, ఉచితంగా టూల్‌కిట్స్ అందజేస్తామన్నారు.

## మురుగు సమస్య

మియాపూర్ : ప్రధాన రహదారులపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు రోడ్డుపై పొంగి పారుతోంది. రెండు నెలల నుండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. రోజు ఈ రోడ్డు వెంబడి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణిస్తుంటారు. వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. ఓ వైపు దుర్వా సన మరోవైపు పాదచారులపై మురుగు నీరు పడుతుందని వాపోతున్నారు. అదేవిధంగా పక్కనే ఉన్న నారాయణ స్కూల్ సెల్లార్ నుండి మురుగు నీరు కూడా రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు, స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మురుగు సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





## వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించిన జోనల్ కమిషనర్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జీహెచ్‌యంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ సోమవారం మూసాపేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఎఫ్ఏల హాజరును పరిశీలించారు. మూసాపేటలోని శక్తి నగర్‌లోని వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించి వర్షపు నీరు సులువుగా ప్రవహించేందుకు, శక్తినగర్‌లో నీరు నిలిచిపోయే పాయింట్‌ను తొలగించేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. అదే విధంగా రోడ్డు వేసేటప్పుడు వర్షపు నీరు నిలిచిపోకుండా ఉండేందుకు లెవెలింగ్‌ను సరిచూసుకోవాలని సూచించారు. సిబిసిఐడి కాలనీలోని మోడల్ మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం 4వ ఫేజులోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలును పరిశీలించిన నీటి లీకేజీలను అరికట్టాలని సూచించారు.అనంతరం కేపీహెచ్‌బీ కాలనీ, 5వ ఫేజులోని రాణి రుద్రమదేవి స్పోర్ట్స్ పార్కును, కాలనీలోని ఇండోర్ స్టేడియాన్ని సందర్శించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని కైలాసవనాన్ని పరిశీలించి తోట నిర్వహణ, టాయిలెట్లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్వహణ ఏజెన్సీ వారిని ఆదేశించారు. ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ రమేష్, ఈఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, గేమ్స్ ఇన్‌స్పెక్టర్ వీరానంద్, అధికారులు పాల్గొన్నారు.